గ్రూప్-1కు 897 పరీక్షా కేంద్రాలు

మొదటిపేజీ తరువాయి...

ప్రిలిమినరీని సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు సీఎస్‌కు తెలిపారు. ఇందులోభాగంగా అదనపు కలెక్టర్లతోపాటు ఒక పోలీసు ఉన్నతాధికారిని కూడా నోడల్ ఆఫీసర్‌గా నియమించినట్టు వెల్లడించారు. ప్రతి 20 కేంద్రాలకు ఒక రీజినల్ కో–ఆర్డినేటర్‌ను కూడా నియమించామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 897 పరీక్షకేంద్రాల్లో జరిగే ఈ పరీక్షకు 4.03 లక్షల మంది విద్యార్థులు హాజరవుతారని వివరించారు. పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించేందుకు జిల్లా వ్యాప్తంగా పోలీసు, ఇతర అధికారులతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్లను ఆమె ఆదేశించారు.

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్

గ్రూప్–1 పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పోలీసు శాఖ వెల్లడించింది. పోలీసు కమిషనర్లు, ఎస్పీలు భద్రతా ఏర్పాట్లను సమీక్షించాలని ఆదేశించింది. చీఫ్ సూపరింటెండెంట్ మినహా ఎవరి వద్ద సెల్‌ఫోన్లు ఉండకూడదని స్పష్టంచేసింది. పరీక్షా కేంద్రంలోనికి అభ్యర్థులు, సిబ్బంది తప్ప ఎవరినీ అనుమతించవద్దని పోలీసు శాఖ ఆదేశించింది.

గ్రూప్–1 రిజర్వేషన్ల వివరాలు చెప్పండి

గ్రూప్–1లో రిజర్వేషన్లకు సంబంధించి వివరాలు తెలుసుకొని చెప్పాలని టీజీపీఎస్సీని హైకోర్టు గురువారం ఆదేశించింది. ప్రభుత్వ నియామకాలకు నిర్వహించే పరీక్షల నోటిఫికేషన్‌లో సమాంతర రిజర్వేషన్లు అమలు చేయాలని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా గ్రూప్–1 పోస్టుల భర్తీలో దివ్యాంగుల క్యాటగిరీలో అమలు చేయడం లేదని పేర్కొంటూ మెదక్ జిల్లాకు చెందిన అర్జున్, అరుణ్ పిటిషన్ దాఖలు చేశారు. దివ్యాంగుల రిజర్వేషన్ల అమలుపై వివరణ ఇవ్వాలని ప్రతివాదులను ఆదేశించారు. సమాంతర రిజర్వేషన్లు అమలు చేసేలా టీజీపీఎస్సీకి ఆదేశాలు జారీ చేయాలని పిటిషనర్ తరపున న్యాయవాది వాదించారు. నియామక పరీక్షల్లో మహిళా, పీహెచ్‌సీ కోటాలో సమాంతర రిజర్వేషన్లు అమలు చేయాలని సుప్రీంకోర్టు, హైకోర్టు గతంలో తీర్పులు చెప్పినప్పటికీ అమలు కావడం లేదని పేర్కొన్నారు. టీజీపీఎస్సీ తరపున స్టాండింగ్ కౌన్సిల్ ప్రతివాదన చేస్తూ, ఉద్యోగాల నియామకాల్లో సమాంతర రిజర్వేషన్లు అమలు చేయడానికే ప్రభుత్వం జీవో 35ను జారీ చేసిందని చెప్పారు. గ్రూప్–1తోపాటు ఇతర అన్ని నిమాయకాల్లో ఇది అమలవుతున్నదని వివరించారు. వాదనల తర్వాత ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన న్యాయమూర్తి.. తదుపరి విచారణను ఈ నెల 10కి వాయిదా వేశారు.

డిగ్రీలో కామర్స్ కింగ్

- మొదటి విడతలో 76,290 మందికి సీట్లు

హైదరాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ): డిగ్రీ కోర్సుల్లో కామర్స్ కోర్సుదే హవా సాగుతున్నది. డిగ్రీ ఫస్టియర్‌లో చేరేందుకు అత్యధికులు కామర్స్ వైపే మొగ్గుచూపుతున్నారు. ఈ విద్యాసంవత్సరం కామర్స్ కోర్సులో 28,655(37.56శాతం) మంది విద్యార్థులు అడ్మిషన్ పొందారు. గత నాలుగైదు ఏండ్లుగా ఇదే ట్రెండ్ కొనసాగుతుండగా, ఈ సారి కూడా అదే పునరావృతమైంది. డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్)మొదటి విడత సీట్లను గురువారం కేటాయించారు. హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, విద్యామండలి చైర్మన్ లింబాద్రి ఆయా వివరాలను మీడియాకు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 886 డిగ్రీ కాలేజీల్లో 3,84,748 సీట్లుండగా, మొదటి విడతలో1,04,784 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకొన్నారు. వీరిలో 76,290 మంది విద్యార్థులు సీట్లు దక్కించుకొన్నారు.

మాసబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో దోస్త్ వివరాలు వెల్లడిస్తున్న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, విద్యామండలి చైర్మన్ లింబాద్రి

62 శాతం అమ్మాయిలే..

తొలివిడతలో 47,867 (62.74శాతం) మంది అమ్మాయిలు సీట్లు దక్కించుకోగా, 28,423 (37.26 శాతం) మంది అబ్బాయిలు సీట్లు పొందారు. వీరిలోనూ కామర్స్ విద్యార్థులే ఎక్కువ మంది ఉండటం విశేషం. మొదటి విడతలో సీట్లు దక్కించుకొన్న 20 మంది టాపర్లలో ఒక్కరే అబ్బాయి ఉండగా, మిగిలినవారంతా అమ్మాయిలే ఉండటం గమనార్హం. సీట్లు పొందిన అభ్యర్థులు ఈ నెల 7 నుంచి 12 వరకు ఆన్‌లైన్ సెల్ఫ్‌రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. సీటు పట్ల సంతృప్తిలేక పోతే సీటును రిజర్వుచేసుకుని, రెండో విడతలో కౌన్సెలింగ్‌లో పాల్గొనవచ్చు.

రెండో విడత రిజిస్ట్రేషన్లు ప్రారంభం

ఇదిలావుండగా, రెండో విడత దోస్త్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ గురువారం నుంచే ప్రారంభమైంది. ఈ ప్రక్రియను ఈ నెల 14 వరకు కొనసాగనున్నది. 18న రెండో విడత సీట్లను కేటాయిస్తారు.

70 కాలేజీల్లో జీరో అడ్మిషన్లు

దోస్త్ కింద మొత్తం డిగ్రీ కళాశాలలు (రెసిడెన్షియల్ మినహా) 886 ఉండగా, వీటిలో మొత్తం 546 కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ కాలేజీల్లో ఈ విద్యాసంవత్సరానికి మొత్తం 3,84,748 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ఇప్పటి వరకు 76,290 సీట్లు భర్తీ కాగా, మిగిలిన సీట్లను రెండు, మూడు, తుది విడతల్లో భర్తీ చేయనున్నారు.

కోర్సుల వారీగా సీట్ల కేటాయింపు

కోర్సు	సీటు దక్కించుకొన్నవారు (శాతం)
కామర్స్	28,655 (37.56)
లైఫ్‌సైన్సెస్	15,301 (20.06)
ఫిజికల్ సైన్సెస్	14,964 (19.61)
ఆర్ట్స్	7,766 (10.18)
డాటాసైన్స్	2,502 (3.28)
డీ ఫార్మసీ	90 (0.12)
ఇతరకోర్సులు	7,012 (9.19)
మొత్తం	76,290

మీడియం వారీగా సీట్ల వివరాలు

ఇంగ్లిష్ మీడియం	72,431
తెలుగు మీడియం	3314
హిందీ మీడియం	05
ఉర్దూ మీడియం	540

విద్యార్థులకు సరిపడ సీట్లు ఉన్నట్టు ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్ లింబాద్రి తెలిపారు. మొదటి విడత సీట్ల కేటాయింపులో జీరో అడ్మిషన్లు నమోదైన కాలేజీలు 70 ఉన్నాయి.

విద్యార్థుల సంఖ్య కంటే సీట్లు ఎక్కువ

విద్యార్థుల సంఖ్య కంటే సీట్లు ఎక్కువగా ఉన్నాయి. ఈసారి ఇంటర్ పాసైనవారు 2,83,530 మంది విద్యార్థులుంటే, డిగ్రీలో 3,84,748 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఉన్నత విద్యలో అమ్మాయిలు ఎక్కువగా రాణిస్తున్నారు. అమ్మాయిలు చదువుకుంటే కుటుంబం బాగుంటుందనే ఉద్దేశంతో విద్యార్థుల తల్లులు పిల్లలను ఉన్నత విద్యలో ప్రోత్సహిస్తున్నారు. ఇది శుభపరిణామం. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియోలో జాతీయ సగటు కంటే విద్యలో మన రాష్ట్రం ముందున్నది. —బుర్రా వెంకటేశం, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి

ఆర్టీసీ ఫేక్ లోగో' కేసులో 41ఏ అమలు చేయండి

పోలీసులకు హైకోర్టు ఉత్తర్వులు

హైదరాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఆర్టీసీ పేరుతో ఫేక్ లోగోను సోషల్ మీడియాలో పోస్టు చేశారంటూ రాష్ట్ర డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్‌పై నమోదైన కేసులో పోలీసులు సీఆర్పీసీ 41ఏ నోటీసు జారీ చేసి ఆ నిబంధనను అమలు చేయాలని పోలీసులకు హైకోర్టు ఆదేశించింది. హైదరాబాద్ సిటీ పోలీసులు పెట్టిన కేసులో సీఆర్పీసీ 41ఏ నిబంధనలు పాటించాలని సూచించింది. నకిలీ లోగో వల్ల ఆర్టీసీ ప్రతిష్టను దెబ్బతింటుందని పేర్కొంటూ ఏ శ్రీధర్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేయడాన్ని దిలీప్ సవాల్ చేసిన వ్యాజ్యాన్ని జస్టిస్ కే సుజన విచారించారు. పిటిషనర్‌పై నమోదు చేసిన కేసులోని సెక్షన్లను పరిశీలిస్తే ఏడేండ్ల లోపు శిక్షపడేవేనని, అర్నేశ్‌కుమార్ –బీహార్ మధ్య కేసులో సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం పిటిషనర్‌కు సీఆర్పీసీ 41ఏ జారీ చేయాలని ఆదేశించారు. ఆ మేరకు పిటిషనర్‌కు పోలీసులు నోటీసులు జారీ చేయాలని చెప్పారు. తదుపరి విచారణ జూలై 11కు వాయిదా వేశారు.

గొర్రెల పంపిణీ కేసు నిందితుడి పిటిషన్ కొట్టివేత

హైదరాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ): గొర్రెల పంపిణీలో అక్రమాలు జరిగాయనే కేసును కొట్టివేయాలని కోరుతూ ఆ కేసులోని నిందితుడు సయ్యద్ మొహిదుద్దీన్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. జస్టిస్ కే సుజన గురువారం తీర్పు వెలువరించారు. గొర్రెలు తీసుకొని వెళ్లి డబ్బు చెల్లించలేదంటూ ఏపీలోని పల్నాడు జిల్లా విర్నూర్ మండలానికి చెందిన సన్నెబోయిన ఏడుకొండలు గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని సయ్యద్ న్యాయవాది కోరారు. పిటిషనర్ పశుసంవర్ధకశాఖ నుంచి టెండర్లు పొంది గొర్రెలు, మేకలు వంటి వాటిని రవాణా చేసే వ్యాపారం చేస్తుంటారని, 2021–23 మధ్యకాలంలో టెండర్ ఏదీ రాకపోవడంతో కోర్టులో కేసు వేసినందుకు అధికారులు కక్షతో తప్పుడు కేసులో ఇరికించారని చెప్పారు. దీనిపై ఏసీబీ తరపు సీనియర్ న్యాయవాది రవికిరణ్‌రావు, పోలీసుల తరపున ఏపీపీ ఎస్ గణేశ్ ప్రతివాదన చేస్తూ, గొర్రెల పంపిణీలో అక్రమాలు జరిగాయనే కేసు దర్యాప్తులో ఉన్నదని, కింది కోర్టులో నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలని, పిటిషన్‌ను కొట్టేయవద్దని కోరారు. వాదనల తరువాత హైకోర్టు, పిటిషనర్ పై ఫిర్యాదులో ప్రాథమిక ఆధారాలు ఉన్నందున పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్టు తీర్పు వెలువరించింది.

విద్యా - ఉద్యోగ సమాచారం

గురుకుల సిబ్బందికి వెంటనే వేతనాలివ్వాలి

సొసైటీ కార్యదర్శి సీతాలక్ష్మికి టీఎస్‌డబ్ల్యూఆర్టీఈఏ విజ్ఞప్తి

హైదరాబాద్, జూన్6 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ (టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ) సొసైటీలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బందికి వెంటనే వేతనాలను విడుదల చేయాలని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ టీచర్స్ అండ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టీఎస్‌డబ్ల్యూఆర్‌టీఈఏ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం సొసైటీ కార్యదర్శి సీతాలక్ష్మికి అసోసియేషన్ అధ్యక్షుడు బాలరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్ విజ్ఞప్తి చేశారు. ప్రతినెలా సొసైటీలో పనిచేస్తున్న రెగ్యులర్ ఉపాధ్యాయులు, సిబ్బందికి వేతనాలను మొదటి వారం తరువాతనే వేస్తున్నారని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి మరింత ఆలస్యంగా వేస్తున్నారని వివరించారు. మే నెల వేతనాలను ఇంతవరకు విడుదల చేయలేదని వెల్లడించారు. ఇప్పటికైనా చొరవ చూపి వేతనాలను వెంటనే విడుదల చేయించాలని సీతాలక్ష్మిని కోరారు.

సీఎం ఆమోదానికి పదోన్నతుల ఫైల్: ఆర్‌యూపీపీ

హైదరాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ): భాషాపండితులు, పీఈటీల పదోన్నతుల ఫైల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదానికి పంపించినట్టు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన తమకు చెప్పినట్టు ఆర్‌యూపీపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎండీ అబ్దుల్లా, గుళ్లపల్లి కాంతికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం ఆమోదం రాగానే షెడ్యూల్‌ను విడుదల చేస్తామని తమకు హామీనిచ్చినట్టు పేర్కొన్నారు.

'పారితోషికం చెల్లింపుపై నేటి నుంచి ఆందోళన'

హైదరాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ): ఇంటర్ జవాబుపత్రాల మూల్యాంకన పారితోషికాన్ని వెంటనే చెల్లించాలని కోరుతూ శుక్రవారం నుంచి ఆందోళనలు చేపట్టనున్నట్టు తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ (టీజీజేఎల్ఏ) ప్రకటించింది. శుక్రవారం క్యాంప్ అధికారులకు వినతిపత్రాలు ఇస్తామని, ఆ తర్వాత దశలవారీగా ఆందోళనలు చేపడతామని ఆ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వీ శ్రీనివాస్, సురేశ్ వెల్లడించారు.

26 వరకు అగ్రి డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు

హైదరాబాద్, జూన్ 6(నమస్తే తెలంగాణ): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలో పలు వ్యవసాయ డిప్లొమా కోర్సులలో ప్రవేశాలకు ఈ నెల 26 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని రిజిస్ట్రార్ రఘురామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, టీఎస్ పాలిసెట్ ర్యాంకు వచ్చిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నది. వివరాలు, ఫీజులు ఇతర సమాచారం కోసం www.pjtsau.edu.in వెబ్‌సైట్‌ను సంప్రదించానలి సూచించారు.

సివిల్స్ ప్రిలిమినరీ ఏర్పాట్లపై వీడియోకాన్ఫరెన్స్

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 6 (నమస్తే తెలంగాణ) : సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షను ఈ నెల 16న పకడ్బందీగా నిర్వహించేందుకు తగు ఏర్పాట్లపై యూపీఎస్సీ అడిషనల్ సెక్రటరీ రాజ్‌కుమార్ ఆరా తీశారు. ఈ మేరకు గురువారం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దేశవ్యాప్తంగా 80 కేంద్రాలలో నిర్వహించే పరీక్షకు 10 లక్షలకు పైగా అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. 16న ఉదయం 9:30 గంటల నుంచి ఉదయం 11:30 గంటల వరకు పేపర్–1 , మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 4:30గంటల వరకు పేపర్–2 పరీక్ష నిర్వహించనున్నట్టు వివరించారు. పరీక్షకు అరగంట ముందే గేట్లు మూసివేస్తారని, కనుక అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో కొవిడ్–19 నిబంధనలు పాటించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, డీఆర్వో వెంకటాచారి పాల్గొన్నారు.

మరో రెండు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు

హైదరాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో మరో రెండు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు కొత్తగా ఏర్పాటయ్యాయి. నారాయణపేట జిల్లాలోని కోస్గిలో ఒకటి, మద్దూరులో మరొకటి ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. మద్దూరుకు కో–ఎడ్యుకేషన్ కాలేజీని ఏర్పాటు చేయగా, కోస్గిలో మహిళా డిగ్రీ కాలేజీని మంజూరుచేశారు. తాజా దోస్త్ అడ్మిషన్లల్లో భాగంగా ఈ రెండు కాలేజీల్లో సీట్లను భర్తీచేస్తారు.

8 నుంచి డీఈఈసెట్ దరఖాస్తులు

హైదరాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ) : డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో ప్రవేశాల నిమిత్తం డీఈఈసెట్ –2024 కు ఈ నెల 8 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సెట్ కన్వీనర్ రాధారెడ్డి తెలిపారు. జూలై 10న ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. దరఖాస్తు చేసే విద్యార్థుల వయస్సు సెప్టెంబర్ 1నాటికి 17 ఏండ్లు పూర్తయి ఉండాలని సూచించారు.

నీట్ యూజీలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో డైరెక్టర్ సుష్మ

నీట్ యూజీలో 'శ్రీచైతన్య' సరికొత్త రికార్డు

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 6(నమస్తే తెలంగాణ) : నీట్ యూజీ – 2024 ఫలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థలు సరికొత్త రికార్డు నెలకొల్పినట్టు డైరెక్టర్ సుష్మ తెలిపారు. 720/720 మార్కులతో ఓపెన్ క్యాటగిరీలో 9 ఆలిండియా ఫస్ట్ ర్యాంకులు సాధించి శ్రీచైతన్య అధిపత్యాన్ని కొనసాగించిందని పేర్కొన్నారు. ఆలిండియా ఓపెన్ క్యాటగిరీలో 1వ ర్యాంకు వీ కళ్యాణ్, పీ పవన్ కుమార్ రెడ్డి, ముఖేశ్ చౌదరీ, భానుతేజసాయి, ఇరాన్ ఖ్వాజీ, దర్శ్ పగ్దార్, ఇషా కొఠారీ, ఆదర్శ్ సింగ్ మోయల్, అమీనా ఆరిఫ్ వరుసగా 9 తొలి ర్యాంకులు సాధించారని తెలిపారు. 715 మార్కులతో 30 మంది, 710 మార్కుల పైన మరో 57మంది, 700 మార్కులపైన 132 మంది, 650 మార్కులపైన 852 మంది శ్రీచైతన్య విద్యార్థులు సత్తా చాటారని వివరించారు. ఈ అద్భుత విజయానికి కారణమైన విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు సుష్మ అభినందనలు తెలిపారు.

వాట్సాప్ గ్రూపులో ఫొటోలు తొలగించారని

ఇద్దరిని హతమార్చిన బీజేపీ నేత

- రంగారెడ్డి జిల్లా కడ్తాల్‌లో ఘటన

కడ్తాల్, జూన్ 6 : వాట్సాప్ గ్రూపులో తన ఫొటోలు తొలగించారంటూ ఓ బీజేపీ నాయకుడు ఇద్దరిని హత్య చేసిన ఘటన రంగారెడ్డి జిల్లా కడ్తాల్ లో కలకలం రేపింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. కడ్తాల్ మండలం గోవిందాయిపల్లికి చెందిన బీజేపీ నేత జల్కం రవి కడ్తాల్ సమీపంలోని బటర్‌ఫ్లై సిటీ వెంచర్‌లో ఓ విల్లాను అద్దెకు తీసుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. ఈ నెల 4న విల్లాలో జరుపుకొన్న తన పుట్టిన రోజు ఫొటోలను రవి తన గ్రామ వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేశాడు. అధిక సంఖ్యలో ఫొటోలు పెట్టడంతో గ్రామానికి చెందిన శేషగారి శివగౌడ్(27), గుండెమోని శివగౌడ్ (25) అభ్యంతరం వ్యక్తం చేయడమేగాక ఫొటోలను గ్రూప్ నుంచి తొలగించారనే నెపంతో రవి బుధవారం సాయంత్రం తన విల్లాకు వారిని పిలిపించుకున్నాడు. ఆ విల్లాలో రవితోపాటు అమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని జంగారెడ్డిపల్లికి చెందిన బీజేవైఎం నాయకుడు పల్లె రాజు గౌడ్ కూడా ఉన్నాడు. నలుగురు కలిసి మద్యం సేవిస్తున్న సమయంలో ఫొటోల తొలగింపు విషయమై వాగ్వాదం చోటుచేసుకున్నది. ఈ క్రమం లో ఆ ఇద్దరు యువకులపై రవి, రాజుగౌడ్ పదునైన ఆయుధాలతో దాడి చేసి చంపి, విల్లాకు తాళం వేసి అక్కడి నుంచి పరారయ్యారు. గురువారం పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన..

బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు, గోవిందాయిపల్లి గ్రామస్థులు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. రెండు గంటలకుపైగా హైదరాబాద్–శ్రీశైలం హైవేపై బైఠాయించడంతో వాహనాలు నిలిచిపోయాయి.

పోలీస్ వర్క్‌షాప్‌లో అధికారిణికి జ్ఞాపిక అందజేస్తున్న డీజీపీ రవిగుప్తా

కొత్త క్రిమినల్ చట్టాలపై పోలీసులకు వర్క్‌షాప్

హైదరాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర పోలీసు అకాడమీలో జూలై 1 నుంచి అమల్లోకి రానున్న కొత్త క్రిమినల్ చట్టాలపై పోలీసు ఉన్నతాధికారులకు గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. డీజీపీ రవిగుప్తా ముఖ్యఅతిథిగా హాజరై కొత్త చట్టాలపై రూపొందించిన 'న్యూ క్రిమినల్ లా బుక్స్' 'రెడీ రికనర్ ఆఫ్ న్యూ లాస్' 'న్యూ క్రిమినల్ లాస్' అనే యాప్‌లను ఆవిష్కరించారు. కొత్త చట్టాలపై క్రిమినల్ లాయర్ ఏపీ సురేశ్ అవగాహన కల్పించారు. అనంతరం అధికారులను బృందాలుగా విభజించి ఇంటరాక్టివ్ చర్చలు జరిపారు.కార్యక్రమంలో హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డా.జితేందర్, పోలీసు అకాడమీ డైరెక్టర్ ఏడీజీ అభిలాషబిష్ట్, ఏడీజీలు శిఖాగోయెల్, సంజయ్ కుమార్ జైన్, విజయ్‌కుమార్, మహేశ్‌భగవత్, సీపీలు కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, తరుణ్ జోషి, అవినాశ్ మహంతి పాల్గొన్నారు.

ట్రిబ్ దూకుడు!

- మైనార్టీ సొసైటీలో పీడీ, లైబ్రేరియన్ అభ్యర్థులకు పోస్టింగ్స్
- 11 నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు నిర్ణయం
- అనేక అంశాలపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు
- ఇప్పటికీ ఎటూ తేలని రిలిక్విష్‌మెంట్ విధానం
- ట్రిబ్ వ్యవహారంపై గురుకుల అభ్యర్థుల ఆగ్రహం

హైదరాబాద్, జూన్6 (నమస్తే తెలంగాణ): గురుకుల పోస్టుల భర్తీలో ప్రభుత్వ నిర్ణయమే ఫైనల్ అని ఇప్పటివరకు తేల్చిచెప్పిన తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ట్రిబ్) ఇప్పుడు అందుకు భిన్నంగా ముందుకుసాగుతున్నదని గురుకుల అభ్యర్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చినా, ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం వెలువరించకపోయినా ట్రిబ్ నియామక ప్రక్రియను పునఃప్రారంభించిందని మండిపడుతున్నారు. మైనార్టీ గురుకుల సొసైటీలో పీడీ, లైబ్రేరియన్ పోస్టుల భర్తీని చేపట్టడంపై తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నారు.

9,210 గురుకుల పోస్టులకు ట్రిబ్ నియామక ప్రక్రియను చేపట్టింది. డీఎల్, జేఎల్, పీజీటీ, టీజీటీ, లైబ్రేరియన్, ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టులకు సంబంధించి ఎంపికైన మెరిట్ అభ్యర్థులను ప్రకటించడంతోపాటు, సొసైటీల వారీగా అపాయింట్‌మెంట్ ఆర్డర్లను కూడా ఇచ్చింది. ఆయా సొసైటీలు అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తిచేసి పోస్టింగ్‌ను ఇవ్వాల్సి ఉన్నది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో సొసైటీలు ఆ ప్రక్రియను ఇప్పటివరకు చేపట్టలేదు. తాజాగా మైనార్టీ గురుకుల సొసైటీ మాత్రం పీడీ, లైబ్రేరియన్ అభ్యర్థులకు పోస్టింగ్‌ను ఇచ్చే ప్రక్రియను ప్రారంభించింది. ఇప్పటికే అపాయింట్‌మెంట్ లెటర్లు అందుకున్న అభ్యర్థులు నిర్దేశిత సర్టిఫికెట్లతో నాంపల్లిలోని అనిసుల్‌గుర్బాలో ఉన్న సొసైటీ కార్యాలయానికి 11,12 తేదీల్లో రావాలని పోస్ట్ ద్వారా కాల్ లెటర్లను కార్యాలయ సొసైటీ కార్యదర్శి, ట్రిబ్ చైర్మన్ అయేషా మస్రత్ ఖానం పంపించారు. ఇప్పుడిదే వివాదానికి తావిస్తున్నది.

గురుకుల అభ్యర్థుల ఆగ్రహం

ట్రిబ్ చైర్మన్, మైనార్టీ గురుకుల సొసైటీ వ్యవహారంపై గురుకుల అభ్యర్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. గురుకుల పోస్టుల భర్తీకి రిలింక్విష్మెంట్, వెయింటింగ్ జాబితా విధానాన్ని అమలు చేయాలని గురుకుల అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. అభ్యర్థుల వాదనలతో ఏకీభవించిన హైకోర్టు అందుకు అనుగుణంగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కానీ మైనార్టీ సొసైటీ మాత్రం ఇప్పుడు పోస్టింగ్ ఇచ్చే ప్రక్రియను చేపట్టింది. దీనిపై అభ్యర్థులు మండిపడుతున్నారు. కామన్ పేపర్‌ను పెట్టి, అవరోహణ క్రమంలో పోస్టుల భర్తీ చేపట్టకుండా, ఆరోహణ పద్ధతిలో రిలిక్విష్మెంట్ లేకుండా ఒకేసారి అన్ని ఉద్యోగాలను భర్తీ చేయడం ద్వారా భారీగా బ్యాక్‌లాగ్‌లు ఏర్పడే అవకాశముందని ఆది నుంచీ వాదిస్తున్నారు. అయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి నిర్ణయం వెలువడకముందే మైనార్టీ సొసైటీలో పోస్టింగ్స్ ఇచ్చే ప్రక్రియను ప్రారంభించడాన్ని తీవ్రంగా తప్పుబడుతున్నారు. ఇప్పటికైనా పోస్టింగ్స్ ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ఆందోళనలకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

ఉద్యోగుల సంక్షేమంపై దృష్టి పెట్టండి

- సింగరేణి సీఎండీ బలరాం

హైదరాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో సింగరేణిలో సంక్షేమ కార్యక్రమాలు, ఉద్యోగులకు అందాల్సిన సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎండీ బలరాం అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ నుంచి సంస్థకు చెందిన 25కు పైగా శాఖల అధిపతులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ ఇంతకాలం బొగ్గు ఉత్పత్తి, రవాణాలపై నెలవారీగా సమీక్షించామని, ఇక నుంచి కార్మికులు, ఉద్యోగుల రక్షణ, సంక్షేమంపై సైతం సమీక్షిస్తామని చెప్పారు.

సచివాలయంలో సీఎస్ శాంతికుమారికి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగ సం